సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 6 । మే । 2024



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
ప్రముఖ పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో శ్రీ కామాక్షి వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి అంకురార్పణ చేశారు. -8లో



వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ
ఎన్నికలు దగ్గరయ్యే కొద్దీ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. సీఎం జగన్ పాలన నచ్చి స్వచ్ఛందంగా చేరుతున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
44.8/31.6

వాతావరణం
జిల్లాలో ఆదివారం 31.6 – 44.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

చెప్పాడంటే.. చేస్తాడంతే!

అడక్కుండానే అన్నీ ఇచ్చాడన్నా



మా స్వగ్రామం నరసాపురం(కాశినాయన మండలం). 20 ఏళ్ల క్రితం చెన్నూరు కొచ్చాం. చేపల వ్యాపారమే జీవనోపాధి. బాడుగ ఇంట్లో ఉన్నాం. జగనన్న ప్రభుత్వంలో సొంత ఇల్లు వచ్చింది. అమ్మఒడి పథకం, విద్యా దీవెన పథకాలొచ్చాయి. డ్వాక్రా గ్రూపునకు వర్తించేవి అన్నీ వస్తున్నాయి. ఈయన హయాంలోనే పేదోళ్లకు మేలు జరిగింది.
–జమాలయ్య, చేపల వ్యాపారం, చెన్నూరు

ఇంటివద్దకే ప్రభుత్వ పథకాలు



పాటిమీదపల్లె గురవయ్యను సాక్షి బృందం పలకరిస్తే జగనన్న అమ్మఒడి వచ్చింది. డ్వాక్రాలో మా భార్య ఉంది. సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా పథకాలు డబ్బులొచ్చాయని చెప్పారు. తల్లి సరోజమ్మకు పింఛన్ వస్తుందని ఇంటివద్దకే పథకాలన్నీ వచ్చాయని తెలిపారు. ఎవ్వరి రెకమెండేషన్ అవసరం లేకుండానే పథకాలొచ్చాయన్నారు. మరోమారు సీఎంగా వైఎస్ జగన్ కొనసాగాలని తెలిపారు. –గురువయ్య, పాటిమీదపల్లె

టీడీపీ అయినా సరే పథకాలు వచ్చాయి



నేను తెలుగుదేశం మద్దతుదారుడిని. అయినా ప్రభుత్వ పథకాలు వచ్చాయి. జగనన్న చేదోడు పథకం ద్వారా రూ.40వేలు వచ్చింది. మా భార్యకు అమ్మఒడి పథకం మూడేళ్లుగా రూ.41వేలు వచ్చింది. మేము ఎవ్వర్ని అడగలేదు. వలంటీర్ల ద్వారానే మాకు ప్రభుత్వ పథకాలు వచ్చాయి. జగన్ ప్రభుత్వంలో సచివాలయం ద్వారా సామాన్యులకు మేలు జరుగుతోందని వివరించారు.
–నాగరాజు, నాయిబ్రాహ్మణుడు, ఖాజీపేట

చంద్రబాబు మీద నమ్మకం లేదు




వ్యక్తిగతంగా నాకు పింఛన్ వస్తాంది. మా భార్యకు డ్వాక్రా ఆసరా వచ్చింది. చేయూత వచ్చింది. సొంత ఇల్లు వచ్చింది. ఎలాంటి అవినీతి లేకుండా అన్నీ ఇచ్చినారు. చంద్రబాబు మీద ఎలాంటి నమ్మకం లేదు. జగన్‌పై మాకు పూర్తి నమ్మకం ఉంది.
–సయ్యద్, డ్రైవర్, ఖాజీపేట.

వైఎస్ అంటే ఓ బ్రాండ్. చెబితే చేస్తారని పూర్వం నుంచి జిల్లాలో ఆ కుటుంబానికి పేరుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పేరును రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించారు. మాట ఇస్తే మాట కోసం ఎందాకైనా నిలబడతారని అనేక పర్యాయాలు నిరూపించారు. ఎన్నికల మేనిఫెస్టోను 99 శాతం అమలు చేసి మాటపై నిలబడ్డారు. చెప్పినవే కాకుండా చెప్పని వాటిని కూడా అమలు చేశారని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ఓటర్లు విశ్వసిస్తున్నారు. పేదల తలరాతలను మార్చేందుకు నాడు–నేడు ఎంతో ఉపయోగపడుతోందని చెబుతున్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ పాలకుడంటే ఇలానే ఉండాలని ఓటర్లు ఆనందం వెలిబుచ్చారు.

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల సంపూర్ణ విశ్వాసం
- చంద్రబాబు ఎప్పుడూ మాట మీద నిలబడింది లేదు
- అవసరానికి తగ్గట్టు హామీలు ఇవ్వడం పరిపాటి
- సాక్షి రోడ్‌షోలో వైఎస్ఆర్ జిల్లా ఓటర్ల మనోగతం

సాక్షి ప్రతినిధి, కడప/కడప సెవెన్‌రోడ్స్: సీఎం వైఎస్ జగన్ చెబితే, చేస్తాడు, చేసేదే చెబుతాడు. డొంకతిరుగుడు వ్యవహారం ఉండదు. సాక్షి రోడ్‌షోలో ఎవరిని కలిసినా ఇదే సమాధానం వస్తోంది. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడప నుంచి ప్రారంభమైన రోడ్‌షో ఆలంఖాన్‌పల్లె, కమలాపురం నియోజకవర్గంలోని చెన్నూరు, మైదుకూరు నియోజకవర్గంలోని చెన్నముక్కపల్లె, పాటిమీదపల్లె, దుంపలగట్టు మేజర్ పంచాయతీ ఖాజీపేట, గుడ్డివీరయ్యసత్రం మీదుగా బద్వేల్ వరకూ సాగింది. రోడ్‌షోలో కర్షకులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తులదారులను సాక్షి బృందం పలకరించింది. సాక్షి పేరు చెప్పకుండా సర్వే అని చెప్పి మాట్లాడించే ప్రయత్నం చేశాం.

- 6గంటలకు కడప కోర్టు వద్ద నుంచి రోడ్ షో ప్రారంభమైంది. 6.05 నిమిషాలకు ఐటీఐ సర్కిల్ చేరుకోగా, అప్పటికే బాషా టీ సెంటర్లో ఉన్న మస్తాన్, సుబ్బరామిరెడ్డి పేపర్ చదువుతూ మాట్లాడుకుంటున్నారు. ఎక్కడికెళ్లినా జనం పట్టలే దబ్బా...మళ్లీ జగనే సీఎం అని సుబ్బరామిరెడ్డి అంటుండగా, అవును, రెడ్డి మాలాంటి సన్నాసపకోళ్లకు జగన్‌రెడ్డే సీఎం కావాలబ్బా. ఎంతోమంది పేదోళ్లకు సాయం చేసినాడు, ఇంటి కొచ్చి అడిగి పథకాలు ఇచ్చాండారు, ఎప్పుడన్నా ఇట్లా లెక్కలిచ్చినోళ్ల, పథకాలిచ్చినోళ్ల ఉన్నారా! మళ్లా ఆయనే రావాల రెడ్డి అంటూ మస్తాన్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరపున వకాల్తా పుచ్చుకున్న లాయర్ లాగా చెబుతున్నాడు. అక్కడి నుంచి ఆలంఖాన్‌పల్లె చేరుకోగా సైపుల్లా టీసెంటర్‌లో అరవై ఏళ్ల పైబడ్డ వీరన్న పేపర్ చేతబట్టి వార్తల్లో మునిగిపోయాడు. పలకరిస్తే పేదోళ్లకు జగన్ సాయం చేసినట్లు ఇంకెవ్వరూ సాయం చేయలేదు. మళ్లీ జగనే సీఎం కావాలని ఆకాంక్షించారు.



చెన్నూరులో...
వృద్ధురాలు అంకమ్మ వడివడిగా నడుస్తూ వెళ్తోంది... ఎక్కడికి వెళ్తున్నావు పెద్దమ్మా అంటే ఏమి చేద్దూ నాయన.. పింఛన్ ఇచ్చేటోళ్లు వచ్చి ఆఫీసుకాడికి రమ్మన్నారు. వెళ్తున్నానని చెప్పింది. బ్యాంకు అకౌంటుకు వేస్తామని చెప్పారు కదా అంటే అకౌంట్ ఉంటే కదు నాయనా, నెలనెలా ఇంటికొచ్చి ఇచ్చేటోళ్లు...ఎలెక్షన్లని ఇంటికాడికి రాకుండా చేసినారు. ఇంతకు మునుపు ఎప్పుడన్నా ఈ పరిస్థితి ఉండేదా? అంటే పాపం ఆ బిడ్డ మాలాంటోళ్ల కోసం ఇంటికాడికే పింఛన్ పంపించేటోడు, మాయదారోడు రాకుండా చేసినాడు నాయన అంటూ చెప్పుకుంటూ వెళ్లింది.

సాక్షి రోడ్ షో

పసుపు–కుంకుమ తప్ప ఏమీ ఇచ్చింది లేదు: మహిళలు




ఉదయం 7 గంటల సమయంలో హైవే పక్కనే దుంపలగట్టు వద్ద కనకాంబరాలు పూలు కోస్తున్న మహిళలను సాక్షి బృందం పలకరించింది. ప్రభుత్వ పాలన ఎలా ఉందమ్మా అంటే బ్రహ్మాండమని టక్కున ముక్త కంఠంతో జవాబు చెప్పారు. డ్వాక్రా రుణమాఫీ ఆసరా డబ్బు మూడు సార్లు వచ్చింది. అమ్మఒడి వచ్చింది. మా అత్త సుబ్బమ్మకు పింఛన్ వచ్చింది...ఇలా చెకచెక నందిరెడ్డి స్వరూప చెప్పుకొచ్చింది. ఆడోళ్లకు ప్రభుత్వ పథకాలు జగన్ ప్రభుత్వంలోనే వచ్చాయని, చంద్రబాబు హయాంలో పసుపు–కుంకుమ పథకం తప్పా ఇంకేమీ రాలేదని నాగులు, శివమ్మ అనే మహిళలు గొంతు కలిపారు. అది కూడా ఎన్నికల ముందు ఇచ్చారన్నారు. మళ్లీ జగనే రావాలని చెప్పారు.

సెంచురీ ఫ్లైబోర్డ్స్ సంస్థ రావడంతో...

బద్వేల్ సమీపంలో సెంచురీ ఫ్లైబోర్డ్స్ సంస్థను 2021 డిసెంబర్ 23న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.45కోట్లతో వాటర్ సరఫరా, 132 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు 6 నెలల్లో సమకూర్చారు. రూ.1600 కోట్లు పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ సంస్థ ఉత్పత్తులను ప్రారంభించింది. స్థానికంగా 2076 మందికి ఉద్యోగాలు దక్కాయి. యువతకు పెద్ద ఎత్తున సొంత ప్రాంతంలోనే ఉపాధి అవకాశాలు లభించడంతో బద్వేల్ ప్రాంతంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనను కొనియాడుతున్నారు. గోపవరం కాలనీకి చెందిన చిన్నబాబు డిగ్రీ పూర్తి చేసి స్థానికంగా అపోలో ఫార్మసీలో పనిచేస్తుండేవారు. సెంచురీఫ్లైబోర్డ్స్ సంస్థలో స్టోర్ అసిస్టెంట్ ఉద్యోగం లభించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జగన్ వల్లే మాకు డబ్బులొచ్చాయి



నాకు జగనన్న చేదోడు పథకం ద్వారా రూ.40వేలు వచ్చింది. మా కొడుక్కు వాహన మిత్ర పథకం వల్ల రూ.40వేలు వచ్చింది. మా భార్యకు వైఎస్సార్ చేయూత పథకం రూ.18,500 మూడేళ్ల వచ్చింది. డ్వాక్రాలో ఆసరా డబ్బులొచ్చాయి. కష్టం చేసుకొని బతికేటోళ్లం. ఇవన్నీ జగనన్న వల్లే మాకు సాధ్యమైంది. ఆయన మేలు మర్చిపోలేమని అన్నయ్య చెప్పుకొచ్చారు.
–అన్నయ్య, రజకుడు, జీవీసత్రం

స్వగ్రామంలో ఉద్యోగం దక్కడం ఆనందదాయకం



అగ్రికల్చర్ బీఎస్సీ చేసిన నేను బెంగళూరులో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేసేవాణ్ణి. స్థానికంగా సెంచురీఫ్లైబోర్డ్స్ సంస్థ రావడం, స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలనే ప్రభుత్వ నిబంధన ఉండడంతో దరఖాస్తు చేసుకున్నా. ఇందులో ప్లాంటేషన్ ఆఫీసర్‌గా ఉద్యోగం దక్కింది. రూ.27వేలు జీతం వస్తోంది. తల్లిదండ్రుల చెంతనే ఉంటూ ఈ జీతం రావడం చాలా సంతోషంగా ఉంది. స్థానికంగా ఇక్కడి రైతులకు కూడా పరిశ్రమ ద్వారా ఉపయోగపడనున్నాను. సీఎం జగనన్న వల్లే నాకు ఈ అవకాశం దక్కింది. –విశ్వనాథరెడ్డి, బద్వేల్.

సీఎం చొరవ వల్లే బద్వేల్‌లో పరిశ్రమ



ఆత్మకూరు పరిసర ప్రాంతాల్లో నెలకొల్పాలనే దిశగా యాజమాన్యం అడుగులు వేసింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండు నియోజకవర్గాలకు సమీపంలో బద్వేల్ నియోజకవర్గంలో నెలకొల్పాలని ఆదేశించారు. దాంతోనే ఇక్కడ పరిశ్రమ వచ్చింది. స్వగ్రామంలో ఉద్యోగం దక్కడం ఆనందంగా ఉంది. –నిరంజన్, బద్వేల్.

సామాన్యులకు జగనే అండాదండా



నేను ఎప్పుడు టీడీపీకే ఓట్లు వేసినోన్ని. మాకెప్పుడు ప్రత్యేకంగా పథకాలుండేవి కాదు. ఈ ప్రభుత్వంలో ఎవ్వరి ప్రమేయం లేకుండా రైతు భరోసా వచ్చింది. పింఛన్ అందుతా ఉంది. ఈసారి నా ఓటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే.
–పెంచలయ్య, కొండూరు దళితవాడ, అట్లూరు

న్యూస్‌రీల్

దేవాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు కల్చరల్: పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించిన దేవాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం పేర్కొన్నారు. ఆదివారం దేవాంగ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10వ తరగతిలో ఇంగ్లీషు, తెలుగు మీడియంలో 360 మార్కులు సాధించిన ప్రతిభ గల పేద విద్యార్థులకు, ఇంటర్‌లో అన్ని గ్రూపుల్లో తెలుగు, ఇంగ్లీషు మీడియంలో 750కు పైగా మార్కులు సాధించిన దేవాంగ విద్యార్థులు ఈ పురస్కారాలకు అర్హులన్నారు. అర్హులైన దేవాంగ విద్యార్థులు ఈ నెల 26 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమావేశంలో దేవాంగ సంక్షేమ సంఘం కార్యదర్శి గిద్దలూరు ఈశ్వరయ్య, ఉపాధ్యక్షుడు వుట్టి లక్ష్మీనారాయణ, కల్యాణ మండపం అధ్యక్షుడు రెడ్డి చంద్రశేఖర, సుబ్రహ్మణ్యం, కార్యదర్శి వెంకట సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మంగంపేట అభివృద్ధికి అన్ని విధాలా కృషి



భారీ ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల

ఓబులవారిపల్లె: మంగంపేట అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం మంగంపేట పంచాయతీ పునరావాస కాలనీలో ఎంపీ, ఎమ్మెల్యేలు భారీ రోడ్ షో నిర్వహించారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పులివెందుల తర్వాత మంగంపేట రెండో సొంత గ్రామం లాంటిదన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక మంగంపేటకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దాదాపు 450 కోట్ల రూపాయలతో మంగంపేట కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ కాలుష్య గ్రామాల తరలింపు, పునరావాసం కల్పించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఏపీఎండీసీ మంగంపేట పాఠశాల విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. సీఎం జగన్ చెప్పింది చేస్తాడన్నారు. ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ ఆర్ హయాంలో మంగంపేట బెరైటీస్ ఆధారితంగా 250 చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసి లక్షలాది మంది ప్రజలకు జీవనోపాధి కల్పించారన్నారు. చంద్రబాబు హయాంలో పల్వరైజింగ్ మిల్లులు వైఎస్సార్‌సీపీ నాయకులకు చెందినవనే నెపంతో కోలుకోలేని విధంగా దెబ్బతీశారన్నారు.

టీడీపీ ప్రచారం.. స్వతంత్రుల సహకారం



టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి ప్రచారంలో పాల్గొన్న స్వతంత్ర అభ్యర్థి దేవిరెడ్డి సంజీవరెడ్డి



వేంపల్లెలో టీడీపీ నేతల ప్రచారంలో పాల్గొన్న స్వతంత్ర అభ్యర్థి నిమ్మకాయల దర్బార్‌బాషా

పులివెందుల నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీకి స్వతంత్ర అభ్యర్థుల సహకారం కొనసాగుతోంది. అభ్యర్థికి మించి స్వతంత్రులు టీడీపీ విజయం కోసం పనిచేస్తున్నారు. పోలింగ్ రోజున అత్యధిక మందిని పోలింగ్ ఏజెంట్లుగా కూర్చోబెట్టి భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యంగా టీడీపీ మైండ్‌గేమ్ ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఆమేరకు స్వతంత్ర అభ్యర్థుల ప్రవర్తన, ప్రచారం కూడా ఉందని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలో ఈ పరిస్థితి మరింత అధికంగా ఉంది. నిన్న రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ అభ్యర్థి అక్కులుగారి విజయ్‌కుమార్‌రెడ్డి బీటెక్ రవి వాహనానికి ఎస్కార్టు తరహాలో వెళ్తూ ప్రచారంలో పాల్గొన్న విషయం తెలిసిందే. అదే కోవలో మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కూడా తెరపైకి వచ్చారు. తాజాగా లింగాల మండలం దొండ్లవాగు గ్రామంలో ఆదివారం టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి ప్రచారం కొనసాగిస్తుండగా ఆ కార్యక్రమంలో స్వతంత్ర అభ్యర్థి దేవిరెడ్డి సంజీవరెడ్డి టీడీపీ కోసం ప్రచారం నిర్వహించారు. వేంపల్లెలో టీడీపీ చేపట్టిన ప్రచారంలో పచ్చ కండువా మెడలో వేసుకొని స్వతంత్ర అభ్యర్థి నిమ్మకాయల దర్బార్‌బాషా టీడీపీ ప్రచారాన్ని కొనసాగించారు.

ముందస్తు వ్యూహంతోనే...
పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా నామినేషన్లు దాఖలు చేయడం ముందస్తు వ్యూహమేనని తెలుస్తోంది. 27మంది అభ్యర్థులు బరిలో ఉండగా, వారికి చెందిన పోలింగ్ ఏజెంట్లకు సీట్లు కేటాయించడం బహుకష్టంగా మారనుంది. పైగా ఎస్కార్టు ఉన్న దస్తగిరి నామినేషన్ దాఖలు చేయడం వెనుక కూడా వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్కార్టు ఉన్న వారంతా క్రమం తప్పకుండా అన్ని పోలింగ్ బూత్‌లలో గుంపుగా వెళ్తూ ఓటర్లలో భయాందోళనలు కలిగించాలనే దురుద్దేశంతో ఉన్నట్లు సమాచారం. తద్వారా తక్కువ ఓటింగ్ నమోదయ్యేలా చూడాలనేది వారి వ్యూహంగా స్పష్టమవుతోంది.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్లు, జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాల్లో ఓటరుగా నమోదై ఉన్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఇందుకోసం ఏడు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. కడప నగరంలోని గాంధీనగర్ హైస్కూలులో పోలింగ్ సిబ్బందికి బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాల్లో ఓటు ఉన్న ఉద్యోగులకు జయనగర్ కాలనీ జెడ్పీ బాలికల హైస్కూలులో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఓటర్లు ఫెసిలిటేషన్ సెంటర్లకు వెళ్లేందుకు, ఓటు వినియోగం తర్వాత వెలుపలికి వచ్చేందుకు ప్రత్యేక ప్రవేశ ద్వారాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. గాంధీనగర్ హైస్కూలులో 3222 మంది తమ ఓటును సజావుగా వినియోగించుకోవడం కోసం 12 ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు.

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	ఓటు వేసినవారు	పోలింగ్ శాతం
బద్వేలు	2247	1695	75.43
జమ్మలమడుగు	1637	1432	87.47
కమలాపురం	1119	1025	91.6
మైదుకూరు	1335	1320	98.87
ప్రొద్దుటూరు	2368	2204	93.07
పులివెందుల	1802	1650	91.56
కడప	3209	2700	84.14

నేడు పోలీసులు, అత్యవసర ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

కలెక్టర్ విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు


కడప సెవెన్‌రోడ్స్: పోలీసు పర్సనల్స్, అత్యవసర సర్వీసులకు చెందిన వారికి సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. అలాగే హోమ్ ఓటింగ్ సోమ, మంగళ వారాల్లో నిర్వహిస్తామన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగం కోసం కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 7.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశానికి ఎస్పీ హాజరవుతారన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ఆయనకు తెలియజేయాలన్నారు. అలాగే శుక్రవారం ఉదయం 10.30 గంటలకు, శనివారం సాయంత్రం 4.00 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తారన్నారు. జిల్లాలోని 2035 పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులతోపాటు ఎన్‌సీసీ, స్కౌట్ సేవలను వినియోగించుకుంటామన్నారు. ఇప్పటివరకు 1101602 (67.2 శాతం) ఓటరు స్లిప్పుల పంపిణీ జరిగిందన్నారు. సుమారు 3.61 లక్షల మందికి ఓటరు గైడ్స్ కూడా పంపిణీ చేశామన్నారు. ఈనెల 10వ తేదీకి ఎన్నికలకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. కోడ్ ఉల్లంఘనలు సంభవిస్తే సి–విజిల్ యాప్ లేదా కమాండ్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబరు 1950కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు.

పోలింగ్ సిబ్బందికి నేడు కూడా పోస్టల్ బ్యాలెట్

ఆదివారం ఓటుహక్కు వినియోగించుకోలేకపోయిన ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్లు సోమవారం కూడా తమకు కేటాయించిన నియోజకవర్గ ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని కోరారు.

రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- మేలు చేశాం.. ఓట్లు అడుగుతున్నాం..
- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి
- మైదుకూరులో ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన



మైదుకూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు: రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే వస్తుందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో ఆదివారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరిగారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కులమతాలకు, పార్టీలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. అందువల్లే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఈ ఎన్నికల్లో వైఎస్ జగన్ పట్ల ఆదరాభిమానాలు చూపుతున్నారని చెప్పారు. 2014 ఎన్నికల్లో, ఎన్నికల ముందు చంద్రబాబు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి రాగానే ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు ఎన్ని హామీలు ఇచ్చినా సూపర్ సిక్స్ పథకాలను వినిపించినా ప్రజలు నమ్మడం లేదన్నారు. జగనన్న చెప్పిందే చేస్తారని చేసేదే చెబుతారని పేర్కొన్నారు. ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించి జగనన్న మళ్లీ ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని అభ్యర్థించారు.

మేలు చేసే ప్రభుత్వం కావాలా..
మోసం చేసే ప్రభుత్వం కావాలా..
ప్రజలందరికీ మేలు చేశామని అందుకే ఈ ఎన్నికల్లో నిర్భయంగా ఓట్లు అడుగుతున్నామని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. ఇంటింటి ప్రచారానికి ముందు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పట్టణంలోని గ్రామ దేవత పెద్దమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటి ప్రచారం సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని తెలిపారు. మేలు చేసే ప్రభుత్వం కావాలా.. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసం చేసే ప్రభుత్వం కావాలా అనేది ప్రజలు తేల్చుకోవాలని కోరారు.

ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన
మైదుకూరులో ఎంపీ, ఎమ్మెల్యే నిర్వహించిన ఇంటింటి ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది యువకులు, మహిళలు అవినాష్‌రెడ్డితో కరచాలనం చేసేందుకు ఉత్సాహం చూపారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, ఆయన కుమారులు సాగర్, పవన్, లక్ష్మీ మాధవ రాయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు, బీఎన్ కిట్టు తదితరులు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, బండి నాగేంద్ర ప్రసాద్, ఏవీ సుబ్బారెడ్డి, ఊటుకూరు రఘురామిరెడ్డి, శెట్టిపల్లె నాగిరెడ్డి, సాకేత్ రెడ్డి, ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం లక్ష్యంగా హోమ్ ఓటింగ్



హోమ్ ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: జిల్లాలో హోమ్ ఓటింగ్ ప్రక్రియ ఆదివారం కూడా కొనసాగింది. శుక్రవారం నుంచి పలువురు వృద్ధులు ఇంటి వద్ద నుంచి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ హోమ్ ఓటింగ్‌ను పర్యవేక్షిస్తున్నారు. హోమ్ ఓటింగ్ ఆప్షన్‌ను ఎంచుకున్న 714 మంది ఓట్ల వివరాలను సేకరించి ఈ మేరకు ఎన్నికల సంఘం ఏర్పాట్లను చేసింది. హోమ్ ఓటింగ్‌ను ఎంచుకున్న ఓటర్ల ఇంటి వద్దకే అధికారుల బృందం వెళ్లి బ్యాలెట్ పేపర్లను అందజేస్తోంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 9782 మంది వృద్ధులు, పీడబ్ల్యూడీలు 18,153 మంది హోమ్ ఓటింగ్ అర్హత కలిగి ఉన్నారు. వీరిలో 85 ఏళ్ల పైబడిన వృద్ధులు 9782 మంది, 40 శాతం అంగవికలత్వం పైబడిన దివ్యాంగులు 18,153 మంది ఉన్నట్లు వారు తెలిపారు. వీరిలో కేవలం 714 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. శుక్ర, శనివారాలలో 458 మంది తమ ఓటు వినియోగించుకున్నారు.

ప్రజా సేవకుడు



పీటీసీగా ఉన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తన సొంత డబ్బు సుమారు రూ.2కోట్లు వెచ్చించి ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లోని 23 రైతుభరోసా కేంద్రాలకు 23 ట్రాక్టర్లను ఉచితంగా ఇచ్చారు. ఆయా గ్రామాల్లోని పేద రైతులు బాడుగ చెల్లించకుండా కేవలం డీజిల్ ఖర్చుతో వ్యవసాయం చేసుకునేందుకు ఎమ్మెల్యే ట్రాక్టర్లు ఇచ్చాడు. రెండేళ్ల క్రితం ట్రాక్టర్లతో పాటు వ్యవసాయ పనిముట్లను కొనుగోలు చేసి అందించారు.

ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం గ్రామంలో వైఎస్సార్ రైతు రథం దగ్గర ఉన్న ఈ రైతు పేరు ఆసం దస్తగిరి రెడ్డి. ఈయన ఎం

ఈ ఫొటోలో ఉన్న తల్లీకూతుళ్ల పేర్లు పోలంకి రమాదేవి, పద్మ. పద్మశాలి కులానికి చెందిన వీరు దొరసానిపల్లెలో కొట్టంలో జీవించేవారు. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో కొట్టం కాలిపోయి నిరాశ్రయులు అయ్యారు. భర్త మరణించడం ఉన్న ఇళ్లు కాలిపోవడంతో రమాదేవి కుటుంబం రోడ్డుపాలైంది. ఇదే విషయమై ఎమ్మెల్యే రాచమల్లును ఆశ్రయించారు. ఎమ్మెల్యే దంపతులు స్వయంగా సంఘటన స్థలాన్ని పరిశీలించి రూ.7 లక్షలు వ్యయంతో మూడు నెలల్లో



ఇళ్లు నిర్మించి ఇచ్చారు. దిక్కులేని ఆ కుటుంబానికి గూడు దక్కింది.



సోములవారిపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న పైలా రమణయాదవ్ 2022 మార్చి 23న రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. పెద్దకుమార్తె రేవతి బీటెక్ థర్డ్ ఇయర్, శాలిని ఇంటర్మీడియట్, నందిని పదవ తరగతి చదువుకుంది. ముగ్గురు ఆడ పిల్లలు కావడంతో సమస్య తెలుసుకున్న ఎమ్మెల్యే రమణ కుటుంబానికి రూ.10లక్షలు ఆర్థిక సాయం చేశాడు.

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్నప్పటి నుంచి రాచమల్లు శివప్రసాదరెడ్డి పెద్ద మనస్సుతో పేదలను అండగా నిలిచారు.

- ప్రజాప్రతినిధిగా బాధ్యతతో మెలిగిన రాచమల్లు
- మరోమారు ప్రజాతీర్పు కోసం విస్తృత ప్రచారం

సాక్షి ప్రతినిధి, కడప : రాచమల్లు శివప్రసాదరెడ్డి కౌన్సిలర్‌గా కొన్ని సంవత్సరాలు పాటు వడ్డీ లేని రుణాలు కొనసాగించారు. డ్వాక్రాను ఆదర్శంగా తీసుకొని మహిళలకు వడ్డీలేని రుణాలను అందించారు. అసలు చెల్లించిన తర్వాత మళ్లీ ఆయా గ్రూపులకు రుణమిచ్చే మొత్తం పెంచుతూ ఆర్థిక తోడ్పాటు కృషి చేశారు. దాదాపు 25వేల మందికి మహిళలకు అండగా నిలిచారు. ఇక స్థాయి పెరిగినా సేవా కార్యక్రమాలను ఆపలేదు. ప్రతి అడుగులో మహిళలకు అండగా నిలిచారు. వివిధ శాఖలల్లో పనిచేస్తున్న చిరుద్యోగులకు వడిబియ్యం కార్యక్రమం పేరిట చీర, సారె పెట్టారు. దేవాలయాలు, దర్గాలు, సామూహిక కళ్యాణ మండపాలు ఇలా నలుగురికి ఉపయోగపడే కార్యక్రమాలకు ముందుండి ప్రోత్సహిస్తూ సేవలు అందించారు. ప్రొద్దుటూరులో ఆటో కార్మికులు ఇబ్బందులను గుర్తించి ఏకంగా రూ.40 లక్షలు సొంత డబ్బులు చెల్లించి ఆటోట్యాక్స్ చెల్లించడం విశేషం. దళిత విద్యార్థి వాత్సల్య ఎంబీబీఎస్ చదువుతానంటే ఆ కోర్సుకు అయ్యే ఖర్చు అంతా భరిస్తానని ముందుకు వచ్చారు.



ఎమ్మెల్యే రాచమల్లు దాతృత్వంతో కృత్రిమ కాలు పొందిన ముత్యాల లక్ష్మీ

గురుశిష్యుల మధ్య రసవత్తర పోరు...





ప్రొద్దుటూరు అసెంబ్లీ అభ్యర్థులుగా పలువురు పోటీ చేస్తున్నా వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్యే రసవత్తర పోరాటం నడుస్తోంది. ఈ ఇద్దరు ఒకనాటి గురుశిష్యులే. ఆ ఇద్దరే నంద్యాల వరదరాజులరెడ్డి, రాచమల్లు శివప్రసాదరెడ్డి. ప్రజాజీవితంలో ఇద్దరికీ సుదీర్ఘ అనుభవమే ఉంది. కాగా కౌన్సిలర్ నుంచి ఎమ్మెల్యే వరకూ ఎదిగినా ప్రజాసేవను కొనసాగిస్తూనే ఉండడం రాచమల్లుకు అదనపు బలమైనట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్వారా వివిధ వర్గాలకు చెందిన 1,38,032 మందికి రూ.1,135.5 కోట్లు లబ్ధి చేకూరింది. ఈనేపథ్యంలో అతి సునాయసంగా విజయం సాధిస్తానని రాచమల్లు శివప్రసాదరెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. హోదా ఉన్నప్పుడు మాత్రమే కన్పించడం, తర్వాత ఉనికి కోసం మాత్రమే తెరపైకి రావడం వరదరాజులరెడ్డికి పెద్ద మైనస్ పాయింట్ అయినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. కాకపోతే సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా పనిచేసిన పరిచయాలతో ప్రచారాన్ని ఊపుమీదకు తీసుకువచ్చారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మరో అవకాశం కోసం ఇద్దరు విశేషంగా ప్రచారం కొనసాగిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ



మైదుకూరు: బీఎస్ మాధవ రాయుడును వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



చింతకొమ్మదిన్నె: వైఎస్ఆర్‌సీపీలో చేరినవారితో కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి



బద్వేలు అర్బన్: వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

ఎన్నికలు దగ్గరయ్యే కొద్దీ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రకటించిన మేనిఫెస్టోకు ఆకర్షితులై కొందరు.. సీఎం జగన్ పాలన నచ్చి మరికొందరు ఇతర పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలోకి స్వచ్ఛందంగా చేరుతున్నారు.

మైదుకూరు : మైదుకూరు నాయకుడు బీఎస్ మాదన్న పెద్దకుమారుడు బీఎస్ మాధవరాయుడు ఆదివారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అంతకుముందు బీఎస్ మాధవ రాయుడు ఇంట్లో నిర్వహించిన తేనీటి విందులో ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొన్నారు. మదీనా దస్తగిరి, శ్రీమన్నారాయణరెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, దండు రామయ్య, భూమిరెడ్డి సుబ్బరాయుడు, కేపీ లింగన్న, గల్లా నరసింహారెడ్డి, బండి నాగేంద్ర ప్రసాద్, గోశెట్టి లక్షుమయ్య తదితరులు పాల్గొన్నారు.

50 కుటుంబాల చేరిక

చింతకొమ్మదిన్నె : కడప నగర పరిధిలోని 17వ డివిజన్లో గల అంగడి వీధిలో ఆదివారం కార్పొరేటర్ చంద్రహాస్ రెడ్డి, డివిజన్ ఇంచార్జ్ మట్లీ శ్రీనివాసులు రెడ్డిల ఆధ్వర్యంలో ఎర్రగుళ్ల వెంకటయ్య, ఎర్ర గొల్ల వెంకట శివకుమార్ నేతత్వంలో ఆదివారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి సమక్షంలో 50 కుటుంబాల వారు వైఎస్ఆర్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఎర్రగుళ్ల శివప్రసాద్, దాసరి గణేష్, దాసరి వెంకటరమణ, ఇల్లపల్లి కార్తీక్, నాగ శివ, నాగవేణి, మల్లీశ్వరి, కష్ణప్రసాద్, గంగాధర్, హరి, శరత్ కుమార్, రాజు, పెంచలమ్మ, సుధారాణి, తదితరులు పార్టీలో చేరారు

ఓబుళంపల్లె నుంచి.. చింతకొమ్మదిన్నె మండలంలోని ఓబులంపల్లి గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపీలో ఆదివారం ఎమ్మెల్యే పి వీంద్రనాథ్ రెడ్డి, సీకే దిన్నె జెడ్పీటీసీ పి. నరేన్ రామాంజుల రెడ్డి సమక్షంలో ఆయన పార్టీ కార్యాలయంలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఎన్. నాగార్జున రెడ్డి, జి.విశ్వనాథరెడ్డి, బి. మహేశ్వర్ రెడ్డి, బి.సురేష్ రెడ్డి, బి.రామకష్ణారెడ్డి, పి. శివ రెడ్డి, పి. నాయబ్ ఖాన్, ఎస్. సయ్యద్ హుస్సేన్, ఎస్. మౌలాలి, ఎస్. రహమతుల్లా, ఎస్. రసూల్ , ఎస్. నాయబ్, ఎస్. సద్దాం, పి. రసూల్, పి. నాగమల్లారెడ్డి, పి.రహమత్ ఖాన్, పి.మల్లేష్, పి. శివ చంద్రారెడ్డి , పి.శివ శంకర్ రెడ్డి ఉన్నారు. మండల కన్వీనర్ గూడా ప్రభాకర్ రెడ్డి, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు

40 కుటుంబాల చేరిక

బద్వేలు అర్బన్: మండల పరిధిలోని తిరువెంగళాపురం పంచాయతీలోని తిరువెంగళాపురం, గాండ్లతిమ్మాయపల్లె, ఎత్తిరాజుపల్లె గ్రామాల నుంచి బిజివేములరామసుబ్బారెడ్డి, దుంపలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 40 కుటుంబాలు ఆదివారం ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ సుబ్బనరసింహ, ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చంద్రఓబుల్‌రెడ్డి, రామసుబ్బయ్య, వెంకటేష్, రామచంద్ర, శ్రీను, సామేలు, రమణయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో 10 కుటుంబాలు చేరిక

మండల పరిధిలోని రాజుపాలెం పంచాయతీ రాజుపాలెం గ్రామంలో టీడీపీకి చెందిన వాకమళ్ల సురేష్‌రెడ్డి, బుట్టివిజయనరసింహారెడ్డిలతో పాటు 10 కుటుంబాలు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బుట్టినరసింహారెడ్డి, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఇన్‌చార్జిలు రమాదేవి, వెంకటసుబ్బారెడ్డి, రమణారెడ్డి, చిదానందంరెడ్డి, మల్లెంకొండంరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

ప్రొద్దుటూరు : మండలంలోని చౌటపల్లె గ్రామానికి చెందిన టీడీపీ వారు ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. చౌటపల్లె గ్రామానికి చెందిన దేవిరెడ్డి హరిబాబురెడ్డి, గండ్లూరు రాంప్రసాద్‌రెడ్డి, దేవిరెడ్డి లక్ష్మిరెడ్డి, దేవిరెడ్డి మనోహర్‌రెడ్డి, దేవిరెడ్డి రామిరెడ్డి, మోపూరు ఉదయ్ కుమార్‌రెడ్డి, మోపూరు ఓబులరెడ్డి, గుమ్మల సుబ్బారెడ్డితోపాటు 30 కుటుంబాల వారికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రసాదరెడ్డిని, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి 60 కుటుంబాల చేరిక

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మద్దయ్యగారిపల్లి పంచాయతికి చెందిన కొత్తకోట హరిప్రసాద్ ఆధ్వర్యంలో 60 కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. తంబళ్ళపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలతో వారిని సత్కరించారు. మండల బీసీ సంఘం అధ్యక్షుడు కే.ఓబులేసు, మాజీ ఎంపీటీసీ అంజప్ప, గ్రామ అధ్యక్షుడు భీమా, బూత్ కమిటి ఇన్చార్జ్ రవీంద్ర, శంకరప్ప, మణి, నాగరాజు, గుప్తా, ఆదినారాయణ,వెంకటేష్, అప్పిరెడ్డి, సురేష్, వెంకట్రమణ,మారుతి, సత్యం, మాబూ, అగ్గిరాముడు, శివన్న, రామచంద్ర, శ్రీనివాసులుతో పాటు మరో 40 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిక కార్యక్రమానికి వందలాదిగా జనం తరలి వచ్చి ద్వారకనాథ్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు.



చింతకొమ్మదిన్నె: వైఎస్ఆర్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

వల్లూరు : ప్రముఖ పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి అంకురార్పణ చేశారు. మొదట శ్రీ కామాక్షీ . వైద్యనాథ స్వామి ఆలయంలో ఆలయ పూజారి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో గణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం పుణ్యాహవాచనము, అఖండ దీపారాధన, రక్షా బంధనము కార్యక్రమాలను నిర్వహించారు. మృత్సంగ్రహణ అనంతరం ఆలయంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. కొండ పైన గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకం చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి విశ్వక్సేన పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. పుట్ట వద్దకు వెళ్లి పవిత్రమైన మట్టిని తీసుకుని వచ్చి భూదేవిగా అలంకరించి మేదినీ పూజను నిర్వహించారు. అనంతరం యాగశాలలో పాళికల్లో వుంచి సోమకుంభాన్ని ఆవాహన చేసి నవధాన్యాలతో అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా పుష్పగిరిలో సోమవారం శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన జరుగుతాయి. అనంతరం అగ్ని ప్రతిష్టాపన, నవ కళశ స్థాపన జరుగుతాయి.



శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో మేదినీ పూజను నిర్వహిస్తున్న అర్చకులు

రాత్రి ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి స్వామి వారికి హంస వాహన సేవ జరుగుతుంది.

శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆయలయంలో రాత్రి విశ్వక్సేన పూజ, అగ్ని ప్రతిష్టాపన, నవ కళశ స్థాపన, ధ్వజా రోహణం, భేరీ పూజలు జరుగుతాయి. స్వామివారికి తిరుచ్చి వాహన సేవ వుంటుందని నిర్వాహకులు తెలిపారు.

రాయలసీమకు ఏం చేస్తారో చెప్పాలి?

ప్రొద్దుటూరు : రాజకీయ పార్టీలు రాయలసీమకు ఏమి చేస్తారో ప్రజలకు చెప్పాలని ఆదివారం ప్రొద్దుటూరులో ప్రజా సంఘాల నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయ పార్టీలకు ప్రజల సమస్యలు గుర్తుకు వస్తాయి కానీ రాయలసీమ సమస్యలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు గుర్తుకు రావడం లేదన్నారు. రాయలసీమకు అతి ముఖ్యమైన నీటి పారుదల రంగం గురించి మాట్లాడటం లేదని, కరువుబారిన పడి వేలాది గ్రామాలు వలసపోతున్న సీమ పల్లెల దుస్థితిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టం స్ఫూర్తికి వ్యతిరేకంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2023 అక్టోబర్ 6న రాయలసీమ నీటి హక్కులకు శాశ్వత సమాధి కట్టే చీకటి చట్టం తెచ్చిందన్నారు. విభజన చట్టం ప్రకారం రాయలసీమ ప్రజలు పోరాడి సాధించుకున్న నీటి హక్కులను ఈ చట్టం దెబ్బతీస్తుందన్నారు. రాయలసీమలోని హంద్రీనీవా, తెలుగుగంగ, గాలేరు-నగరి, వెలుగొండ ప్రాజెక్టులను కేంద్రం పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలు ఈ విషయాల గురించి పార్టీలను నిలదీయాలని పేర్కొన్నారు. రాయ లసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్‌పీ మహమూద్, రాయలసీమ మహిళా శక్తి నాయకురాలు లక్ష్మీదేవి, రాయలసీమ విద్యార్థిశక్తి నాయకురాలు హరిత, దళిత సమాఖ్య నాయ కుడు ఎల్లయ్య, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, డేవిడ్ దస్తగిరి, లెక్చరర్ శ్రీనివాస్, పౌరహక్కుల సంఘం నాయ కుడు సురేష్, విరసం వరలక్ష్మి, చైతన్య, పద్మ పాల్గొన్నారు.

Format C-1
(for candidate to publish in Newspapers, TV)

Declaration about criminal cases
(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and address of candidate: YEDUGURI SANDINTI AVINASH REDDY, S/o YS.Bhaskar Reddy, R/o D.No.3/9/76, Pulivendula Polymers, Near Venkatappa School Main Branch, Bakarapuram, Pulivendula, YSR Kadapa District - 516390.

Name of political party: **YUVAJANA SRAMIKA RYTHU CONGRESS PARTY**

Name of Election **21 KADAPA PARLIAMENTARY CONSTITUENCY GENERAL ELECTIONS 2024** (name of candidate), a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending criminal cases

Sl. No.	Name of Court	Case No. and date	Status of case(s)	Section(s) of Acts concerned and brief description of offence(s)
1	Principle Special Sessions Judge for CBI Cases Nampally, Hyderabad, Telangana State	RC- (S)/2020/CBI/SC-III/ NEW DELHI, (crime No.84/2019) dated 15.03.2019, Pulivendula Police Station U/G, YSR District) SC.No.1/2023	For the compliance of U/Sec 207 Cr.P.C	Sec 120-B, IPC, Punishment for Criminal Conspiracy, Sec 302 IPC Punishment for Murder, Sec.201 IPC punishment for Disappearance of evidence of offence, or Giving false information to screen offender
2	Hon'ble Judicial Magistrate of 1st Class Mydukur. YSR District AP	Crime No.418 of 2018 dated 08.08.2018	Charge sheet is not filed	U/Sec 341 IPC Punishment for wrongful restrain, U/sec 188 of IPC disobedience to orders duly promulgated by public servants, and U/sec 34 of IPC acts done by several persons in furtherance of common intention.

(B) Details about cases of conviction for criminal offences : NO

Sl. No.	Name of the Court and dates of orders	Description of offence & punishment imposed	Maximum punishment imposed
	NIL	NIL	NIL

House of people 21 Kadapa Parliamentary constituency

Sd/-
Yeduguri Sandinti Avinash Reddy

వడదెబ్బకు రాలుతున్న
పండుటాకులు

పోరుమామిళ్ల : వారం పది రోజులుగా ఎండలు విపరీతంగా పెరిగిపోయాయి. 45 డిగ్రీలు దాటిపోయింది. ఉదయం 7 నుంచే ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. దీంతో వయోవృద్ధులు తట్టుకోలేకపోతున్నారు. వడదెబ్బకు ప్రాణాలు విడుస్తున్నారు. ఆదివారం పట్టణంలోని బెస్తవీధికి చెందిన మహబూబ్‌సాహెబ్ (73) వడదెబ్బతో మృతి చెందాడు. శనివారం ఆర్యవైశ్య వృద్ధుడు తులసి వెంకటసుబ్బయ్య(73) వడదెబ్బతో మృతి చెందాడు. అగ్రహారానికి చెందిన 90 ఏండ్ల వృద్ధుడు కటారు పెద్ద వెంకటయ్య కడప రిమ్స్ ఆసుపత్రిలో రెండు రోజులుగా చికిత్స పొందుతున్నాడు.



మహబూబ్ సాహెబ్ మృతదేహం



లక్ష్మయ్య (ఫైల్)


కొండాపురం : మండల కేంద్రంలోని పాత కొండాపురానికి చెందిన జొల్లు వెంకట లక్ష్మయ్య(75) వడదెబ్బతో ఆదివారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వారం రోజుల నుంచి ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఇంటి ఆవరణలో ఉన్నట్లుండి స్పృహ కోల్పోయి మృతి చెందినట్లు తెలిపారు.

వడదెబ్బతో 5మంది మృతి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం వడదెబ్బతో 5మంది వృద్ధులు మృతి చెందారు. ఎండలు అధికంగా ఉండడంతో మండలంలోని రాజుపేటలో ముగ్గురు, పెద్దురాజుపల్లెలో ఒక్కరు, గుండాపురంలో ఒకరూ మృతి చెందారు. వైద్య సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి వడదెబ్బ నివారణ గురించి తగు సూచనలు ఇవ్వడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలి మృతి

కొండాపురం : మండల పరిధిలోని పి.అనంతపురం గ్రామానికి చెందిన గుర్రమ్మ(60) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఎస్ఐ యోగీంద్ర ఆదివారం తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రమ్మ పుశువుల పేడ సేకరించి దాన్ని విక్రయిస్తూ జీవనం సాగించేది. శనివారం పేడ కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే ఎస్. తిమ్మాపురం గ్రామ సమీపంలోని కంప చెట్ల వద్ద మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన గుర్రమ్మ